
సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం । 12 । నవంబర్ । 2024



కార్తిక శోభ
నాగాయలంక: కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద కార్తిక మాసం సందర్భంగా రామలింగేశ్వరుడికి అభిషేకం చేశారు. భక్తులు దీపాలు వెలిగించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.



ప్రతిభకు అవార్డులు
విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన జాతీయ విద్యాదినోత్సవంలో ప్రతిభ చూపిన పలువురికి అవార్డులు అందజేశారు.

న్యూస్‌రీల్

వైభవంగా పాండురంగస్వామి ఉత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని కీర పండరీపురం (చిలకలపూడి)లో వేంచేసి ఉన్న రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, విఠల్ కోటి పూజ, గురుపూజ, శ్రీ లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ పూజలను ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం పర్యవేక్షించారు. ఆలయంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులను రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని నిత్యాన్నదానానికి గన్నవరానికి చెందిన భక్తులు సోమవారం రూ. లక్ష విరాళం అందజేశారు. గన్నవరం గొల్లనపల్లికి చెందిన బొబ్బ గాంధీ కుటుంబం ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళంగా ఇచ్చారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారి రమేష్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ విజేత కృష్ణా



విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ బాలికల ట్రోఫీని కృష్ణా జిల్లా జట్టు కైవసం చేసుకుంది. పటమటలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు సోమవారం ముగిశాయి. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో విజయనగరం నిలిచాయి. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.ఎస్తేరు రాణి, లయన్స్ క్లబ్ జ్యూరీ మిరియాల వెంకటేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ షేక్ లాల్‌మధు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్.దుర్గారావు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

ముగిసిన జాతీయ పోటీలు



విజయవాడస్పోర్ట్స్: హైదరాబాద్ రీజియన్ మౌంట్ ఫోర్ట్ స్కూల్స్ జాతీయ పోటీలు సోమవారం ముగిశాయి. విజయవాడలోని ఎస్ఎస్ఎం స్కూల్లో మూడు రోజుల పాటు జరిగిన పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి 1,200 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ విన్నర్ ట్రోఫీని లిటిల్‌ఫ్లవర్ స్కూల్(హైదరాబాద్), రన్నర్ ట్రోఫీని ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్(విజయవాడ) దక్కించుకున్నాయి. అథ్లెటిక్స్ విభాగంలో తొమ్మిది మందిని, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో పది మందిని ఉత్తమ క్రీడాకారులుగా గుర్తించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థులు విద్యతోపాటు ఆట్లోనూ రాణించాలని అతిథులు ఆకాంక్షించారు. విజేతలకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, బిషప్ మోస్ట్ రెవరెండ్ జోసెఫ్ రాజారావు తెలగతోటి, ఎస్ఎస్ఎం స్కూల్ ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ మౌంటి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి బహుమతులు అందజేశారు.

హామీలు ఘనం.. నిధులు శూన్యం

ఎన్నికల సమయంలో బాబు హామీల ష్యూరిటీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే నో గ్యారెంటీ ఇచ్చిందనిపిస్తోంది. దీంతో రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశ పరిచింది. బడ్జెట్‌లో 'సూపర్ సిక్స్'కు నిధుల కేటాయింపులు లేకపోవడంతో యువత, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వం తీరు ప్రజలను నిరాశపరిచిందని చెప్పొచ్చు.



మాట మరిచారు.. బుడమేరు ఆధునికీకరణ ఊసు లేదు

- తూతూమంత్రంగా 'కూటమి' బడ్జెట్
- ఉమ్మడి జిల్లాకు అరకొరగా కేటాయింపు
- అన్ని వర్గాలకూ నిరాశే
- బుడమేరు ఆధునికీకరణ ఊసే లేదు
- బందరు పోర్టుపై చిన్నచూపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: హామీలు ఘనం.. నిధులు శూన్యం అన్నట్లు కూటమి ప్రభుత్వ తీరుంది. రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలకు అరకొరగా నిధులు కేటాయించడమే దీనికి నిదర్శనం. శాసనసభలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల ఊసే కానరాలేదు. నీటిపారుదల ప్రాజెక్టులకు అరకొరగానే నిధులు కేటాయించారు. అమరావతి నిర్మాణానికి కూడా అప్పు రూపంలో మాత్రం నిధులు తెచ్చుకొంటున్నారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

భరోసా ఏదీ..!
సెప్టెంబరులో వచ్చిన బుడమేరు వరదలకు బెజవాడలో సగం భాగం నీట మునిగింది. పదిరోజులకు పైగా ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విలవిలాడారు. సీఎం చంద్రబాబు వరద ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. అయితే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బుడమేరు ఆధునికీకరణకు పైసా కూడా కేటాయించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బుడమేరు ముంపు ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే విజయవాడకు 4.31 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి పారుదల రంగానికి నామ మాత్రంగా నిధులు కేటాయించారు. కృష్ణా డెల్టాకు కేవలం రూ.138.76 కోట్ల నిధులను మాత్రమే కేటాయించారు. పులిచింతలకు రూ.29.45 కోట్లు ఇచ్చారు. 2026 జూన్ నాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారు. ఇవి పూర్తయ్యేందుకు రూ.4వేల కోట్లకు పైగా నిధులు అవసరం. అయితే ప్రస్తుతం రూ.150 కోట్ల నిధులు కేటాయించి ఎలా ప్రాజెక్టును పూర్తి చేస్తారోనని, నీటిపారుదల రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. బందరు పోర్టుకు నామమాత్రంగా రూ.150 కోట్లు మాత్రమే కేటాయించారు. పోర్టును ప్రభుత్వం చిన్నచూపు చూసిందనే భావన వ్యక్తం అవుతోంది. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు రూ.29.51 కోట్లను కేటాయించారు.



బందరు పోర్ట్ నిర్మాణ పనులకు బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులే..

నీలినీడలు
ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన పలు హామీలకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు ష్యూరిటీ ఇవ్వలేదు. దీంతో సూపర్ సిక్స్ హామీలపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

మహిళలకు రూ.1500 మాటేదీ!
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఊదరగొట్టారు. బడ్జెట్‌లో ఈ పథకం ఊసే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 8,30,958 మంది, కృష్ణా జిల్లాలో 7,39,202 మంది అర్హులైన మహిళలు ఉన్నారు. వీరంతా బాబు మాటను నమ్మి నిండా మునిగామని నిట్టూరుస్తున్నారు.

ఉచిత బస్సు రాలేదు
ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ కూటమి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో దీని మాటే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 9.70 లక్షల మంది, కృష్ణా జిల్లాలో 9 లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. ఇలా ఎన్నికల్లో బాబు ఇచ్చిన పలు హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. బాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారనే భావన వ్యక్తం అవుతోంది.

అన్నదాతకు అరకొరగా..
ఉమ్మడి కృష్ణాజిల్లాలో రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో మాత్రం అరకొరగానే నిధులు కేటాయించడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. రైతులు ఎన్టీఆర్ జిల్లాలో 1,41,726 మంది రైతులు, కృష్ణా జిల్లాలో 2.70 లక్షల మంది ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగులకు భృతి నిల్
తాము అధికారం చేపట్టగానే వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని, లేదా నిరుద్యోగ భృతికింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతికి సంబంధించి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. ఇంటికో ఉద్యోగం అంటే.. ఎన్టీఆర్ జిల్లాలో 6,09,032 కుటుంబాలు, కృష్ణా జిల్లాలో 8 లక్షల కుటుంబాలకు తీవ్ర నిరాశే మిగిల్చింది.

తల్లికి వందనం ఏదీ...!
ఎన్నికల హామీల్లో స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల చొప్పున తల్లికి వందనం కింద ఇస్తామని చెప్పారు. బడ్జెట్‌లో దీనికి అరకొరగా కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లాలో 3.35 లక్షల మంది, కృష్ణా జిల్లాలో 2.42 మంది తల్లులు పెదవి విరుస్తున్నారు.

యువతను విస్మరించారు..



ఎన్నికల సమయంలో యువతకు అధిక ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి బడ్జెట్‌లో యువతను నిరుత్సాహపర్చారు. నిరుద్యోగ భృతిని కూడా పట్టించుకోలేదు. నిధులు కేటాయించలేదు.
–కె.పవన్‌కుమార్, నిరుద్యోగి చిరిచింతల, గుడివాడ

మహిళలను పట్టించుకోలేదు



మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదు. బడ్జెట్‌లో పథకానికి నిధులు కేటాయిస్తారని ఎదురు చూసిన మహిళలకు నిరాశే ఎదురైంది. ఇస్తారన్న నమ్మకం కల్పించలేదు. బడ్జెట్‌లో మహిళల పట్ల నిరాశజనకంగా ఉంది.
–జి.లక్ష్మీలీల, ఎల్ఎన్‌పురం, నందివాడ

హామీలు అమలుచేయాలి



మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్లో ఇచ్చిన కేటాయింపులు అరకొరే. సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ముఖ్యంగా అమ్మకు వందనం, మహిళా ఉద్యోగులు కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కేటాయింపులు చేయాల్సిందే. ప్రస్తుతం ఇచ్చిన కేటాయింపులు కంటి తుడుపు చర్య.
–గుర్రం కుమారి, కంకిపాడు

పేదలకు నిరాశ



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు నిరాశే మిగిలింది. హామీలకు తూట్లు పొడిచారు. పథకాలకు బడ్జెట్ కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనం. పేదలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారికి నిరాశే మిగిలింది.
– ఎన్వీ నారాయణ, గుడివాడ

నేటి తరానికి స్ఫూర్తి అబుల్ కలాం

కలెక్టర్ డీకే బాలాజీ



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తి కావాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యాన జెడ్పీ సమావేశ మందిరంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ జాతీయతను, సమగ్రతను పెంపొందించడానికి ఆజాద్ గొప్ప ఆలోచనలు, దూరదృష్టి ఉన్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఐఐటీ వంటి జాతీయ ఉన్నత విద్యా సంస్థలు దేశంలో ఏర్పాటుకు ఆయన ఉన్నత ఆలోచనలే కారణమన్నారు. ఇంట్లోనే చదివి ఐదు భాషల్లో ప్రావీణ్యం పొందిన మహనీయుడని కొనియాడారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీకి సన్నిహితుడు అబుల్ కలాం ఆజాద్ అని ఆయనతో అనేకసార్లు జైలుకు వెళ్లారన్నారు. ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినంగా జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ దేశంలో అన్ని భాషలు, జాతులను ఏకతాటిపై నిలపడానికి ఆజాద్ బీజం వేశారన్నారు. మైనార్టీ నేతలు, ముస్లిం పెద్దలు ఆజాద్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఈవో పీవీజీ రామారావు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఎస్పీ అబ్దుల్ సుభానీ, డీవైఈవో శేఖర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్తిక' స్నానాలకు సకల సౌకర్యాలు

బీచ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన జాయింట్ కలెక్టర్, ఎస్పీ



బీచ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని సముద్ర స్నానాలు ఆచరించే భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి ఆమె ఎస్పీ గంగాధరరావుతో కలిసి మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. పుణ్యస్నానాల సందర్భంగా బీచ్ వద్ద అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించి పలు ఆదేశాలు ఇచ్చారు. జేసీ మాట్లాడుతూ బీచ్‌తో పాటు దత్తాశ్రమం వద్ద వైద్య శిబిరాలు, హెల్ప్ డెస్కులు, తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బీచ్ వద్ద లైటింగ్, బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన బోట్లుతో పాటు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేయాలని చెప్పారు. భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. బీచ్ వద్ద ఏర్పాట్లపై ఈనెల 13వ తేదీన కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ బీచ్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బందరు ఆర్డీవో స్వాతి, డీపీఓ జె.అరుణ, బందరు డీఎస్పీ ఎండీఅబ్దుల్ సుభాని, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జె. గీతాబాయి, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజులు, టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జై భవానీ.. జైజై భవానీ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష స్వీకరణ మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. మండల దీక్షల స్వీకరణ కార్తిక పౌర్ణమి శుక్రవారం వరకు కొనసాగుతుంది. తొలుత దుర్గమ్మ మూలవిరాట్‌కు పూజలు చేశారు. అనంతరం పగడాల దండను అలంకరించడంతో భవానీ దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మహా మండపం ఆరో అంతస్తు వరకు ఊరేగింపు తీసుకొచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేద మంత్రోచ్చరణల మధ్య ముందుకు సాగగా భక్తులు జై భవానీ.. జైజై భవానీ అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారికి ఆలయ గురు భవానీ యుద్ధనపూడి నాగరాజశాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, పూజలు చేశారు.

లెక్కలేనితనం ప్రదర్శిస్తే చర్యలు

- 'మీ కోసం'కు 10.30 గంటలకు హాజరుకాలేకపోతే వెళ్లిపోండి
- తాను మెసేజ్‌లు పెట్టినా చూసే పరిస్థితి లేదు
- అధికారులపై కలెక్టర్ డీకే బాలాజీ ఆగ్రహం
- మీ కోసంలో 126 అర్జీలు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖర్

చిలకలపూడి(మచిలీపట్నం): అధికారులు లెక్కలేనితనం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి అర్జీలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ తాను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్‌లు పెడుతున్నానని దాన్ని ఒక్క అధికారి కూడా చూసి స్పందించి నివేదికలు ఇవ్వడం లేదన్నారు. 'మీ కోసం'కు 10.30 గంటలకు తప్పకుండా జిల్లా అధికారులు హాజరుకావాలని ఒక్క నిమిషం దాటినా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. 10.30 తరువాత అధికారులను లోపలకు రానివ్వకుండా తలుపులు వేసేయాలని అటెండర్లను ఆయన ఆదేశించారు. ప్రతి సోమవారం చేనేత దినంగా పరిగణించి జిల్లా అధికారులు చేనేత వస్త్రాలను ధరించి విధులకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే వారం నుంచి తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాల విక్రయ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మీకోసం కార్యక్రమంలో అధికారులు 126 అర్జీలను స్వీకరించారు.

అర్జీలు ఇవే

- నాగాయలంక మండలం బోడవరం గ్రామానికి చెందిన చిరివెళ్ల నాగరాజు 2021లో గ్రామంలో క్షేత్రసహాయకులుగా పనిచేసిన ఎ.ప్రశాంత్ పలు రకాల అవకతవకలకు పాల్పడటంతో అతన్ని విధుల నుంచి తొలగించారని దీనిపై విచారణ జరిపి అక్రమంగా లబ్ధి పొందిన వారి వద్ద నుంచి ప్రభుత్వ సొమ్మును వసూలు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- పెడన మండలం నందమూరు గ్రామానికి చెందిన పీవీవీ శ్రీనివాసరావు తదితరులు గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 102/2 లో ప్రభుత్వ పంచాయతీ రహదారిగా ఉందని దాన్ని పరసా సుబ్బారావు మరో ఎనిమిది మంది కలిసి ఆక్రమించారని ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా చేశారన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి చెప్పినా పట్టించుకోవడం లేదని చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.
- మచిలీపట్నంలోని మల్కాపట్నంకు చెందిన బి. దుర్గానాగాంజనేయులు తన కుమారుడు భానుపూర్ణ అనీష్ నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో మొదటి తరగతి చదువుతున్నాడని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచితంగా సీటు వచ్చిందని ప్రిన్సిపాల్ ఫోన్ చేసి ఫీజు చెల్లించాలని తన కుమారుడిని పాఠశాల బయట కూర్చోబెడుతున్నారని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ ఆధీనంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మీకోసం సమావేశం మందిరంలో జిల్లాలోని దేవదాయశాఖ అధికారులతో ఆయన సమావేశమై దేవాలయాల వారీగా ఆస్తులు, ఆదాయ వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం, శ్రీకాకుళంలో చల్లపల్లి రాజా ఎస్టేట్ గ్రూపులో భాగంగా ఈనాం భూములు, సర్వీస్ భూముల విషయం, వేమవరం శ్రీ కొండాలమ్మ దేవాలయానికి సంబంధించి అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే ఆయన స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎన్వీ సాంబశివరావు, పలు దేవాలయాల కార్యనిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై చంద్రబాబు కుయుక్తులు

- డ్రోన్లు, సీ ప్లేన్‌తో ప్రజలకు ఒరిగేదేమిటి?
- కార్యకర్తలపై చేస్తున్న వేధింపులపై న్యాయ, రాజకీయ పోరాటం
- మీడియాతో మాజీ మంత్రి పేర్ని నాని



బందరులో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై ఆలోచించకుండా వైఎస్సార్ సీపీపై కుయుక్తులు పన్నుతోందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ధ్వజమెత్తారు. మచిలీపట్నంలోని సబ్‌జైలులో సోషల్ మీడియా కార్యకర్తలను పరామర్శించిన అనంతరం సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా డ్రోన్ షోలు, సీ ప్లేన్‌లు ఏర్పాటు చేసి ఆనందం పొందుతున్నారని వీటితో ఒరిగేదేంటని ప్రశ్నించారు. నాడు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టిన మెడికల్ కళాశాలలు, పాఠశాలల ఆధునికీకరణలో పోటీ పడి ఇంకా అద్భుతంగా తయారు చేయాలనే ఆలోచన చేయకుండా తల్లిదండ్రులపై భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీ ప్లేన్ పెట్టిన చోటల్లా దివాళా తీసిన సంగతి కూటమి నాయకులకు తెలియదా అన్నారు.

నేత, మైనార్టీలపై వేధింపులు, బెదిరింపులు

పేద కుటుంబాలకు చెందిన చేనేత, మైనార్టీలైన శ్యాంసుందర్, ఖాజా బాబాపై మూడు ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వమే ఉండదని ఆయన ఉద్యోగులను హెచ్చరించారు. గుడివాడ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు ఆదిశేషు, శ్యామ్‌లు కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. జగన్ పోలీసులను బెదిరిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారని ఇటీవల ఆయన డీజీపీ, అధికారులను బెదిరించలేదా అని ఆయన ప్రశ్నించారు. కాగిత బాబు పేరుతో వైఎస్సార్ సీపీ నాయకుల వ్యక్తిగత వ్యవహారాలతో పోస్టింగ్‌లు పెడుతున్నారని అది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడిలా ఏడవడం, నటించడం తమకు తెలియదని కేసులపై పోరాటం ఒక్కటే తమకు తెలుసని చెప్పారు. జగన్‌పై పోస్టులు పెట్టిన సోషల్ మీడియా కార్యకర్తలను దమ్ముంటే అరెస్టు చేయగలరా అని ఆయన అన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా న్యాయ, రాజకీయ పోరాటం చేస్తామేగానీ భయపడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉప్పాల రాము, దేవభక్తుని చక్రవర్తి ఇతర నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రాలు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా సోమవారం తన చాంబర్‌లో కలెక్టర్ డీకే బాలాజీ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. తోట్లవల్లూరు మండలం ఈవోపీఆర్డీ కార్యాలయంలో కె.రమ్యను జూనియర్ అసిస్టెంట్‌గా, గన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా సీహెచ్ నవ్యను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో జె.అరుణ పాల్గొన్నారు.

ఉయ్యూరులో జాబ్‌మేళా

ఉయ్యూరు: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్, ప్రభుత్వ ఎస్‌పీసీ సెంటరు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉయ్యూరులోని ఎస్‌పీసీ సెంటరులో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో బిజెడ్ ఫిన్సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం ఇతర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 35 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరు కాగా 18 మంది ప్రతిభావంతులను ఎంపిక చేశారు. జాబ్‌మేళాను జిల్లా ఒకేషనల్, ఉపాధి కల్పనాధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్ పర్యవేక్షించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి తుర్లపాటి మధు, ఎస్‌పీసీ సెంటరు ఇన్‌చార్జి రవి సుధాకర్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూడో జట్ల ఎంపిక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సోమవారం జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల జూడో టోర్నమెంట్‌లో విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 22 నుంచి 25 వరకూ భోపాల్‌లో జరిగే వెస్ట్‌జోన్ పోటీల్లో పాల్గొంటారు.

మండలంలోని గణపేశ్వరం శ్మశానం పక్కన, పాఠశాలకు సమీపంలో పంటపొలాల మధ్యలో టీడీపీ వర్గీయులు గత వారం రోజులుగా పగలనకా రాత్రనకా బుసక తవ్వి విచ్చలవిడిగా తరలించేస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ వారి దృష్టికి తీసుకువెళితే...అవునా..మాకు తెలియదే.. అంటూ అమాయకపు ఫోజులిస్తున్నారు. కలెక్టర్ గారూ...ఇక్కడ ఇంత జరుగుతున్నా పాపం.. మీ వాళ్లకు ఏమీ తెలియదంటా...మీరన్నా ఓ సారి ఇటువైపు చూడండి సారూ...అంటూ స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.


గణపేశ్వరం గ్రామ సమీపాన శ్మశానం పక్కన బుసక భూమిని(దిబ్బలు) భారీగా తవ్వి గుట్టలు పెట్టిన వైనం

పట్టపగలే బుసక బొక్కేస్తున్నారు!

కలెక్టర్ గారూ.. ఓసారి ఇటు చూడండి సారూ!

- గణపేశ్వరంలో రేయింబగళ్లూ ఇష్టారాజ్యంగా బుసక తవ్వకాలు
- ఆదమరిస్తే శ్మశానం భూములూ మిగలవంటున్న గ్రామస్తులు
- తవ్వుతున్నారా? మాకేం తెలియదే.. అంటున్న రెవెన్యూ వర్గాలు
- రెండు పొక్లెయిన్‌లు 15ట్రాక్టర్లతో పట్టపగలే స్వైరవిహారం

నాగాయలంక: మండలంలోని గణపేశ్వరం గ్రామంలో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా బుసక దిబ్బలు తవ్వేస్తున్నారు. స్థానికంగా అధికారులు కళ్లుండీ చూడలేని విధంగా చేష్టలుడిగి చూస్తున్నారు. ఎవరైనా గ్రామస్తులు ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే...అలాగా...మాకు తెలియదే అంటూ అమాయకత్వం నటిస్తున్నారు. ఒక కాంట్రాక్టర్‌కు రహదారుల నిర్మాణంలో వినియోగించడానికి టీడీపీకి చెందిన సబ్ కాంట్రాక్టర్ ఈ బుసక


గణపేశ్వరం నుంచి పర్రచివర వైపు పట్టపగలు బుసకను తరలిస్తున్న ట్రాక్టర్లు

దిబ్బలు తవ్వి తరలిస్తున్నట్లు తెలిసింది. తీర ప్రాంతంలో పటిష్టంగా నిర్మించాల్సిన రహదారులకు వర్షానికే జారిపోయే బుసకను కాంట్రాక్టర్ ఎలా వాడతారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. నిత్యం రాకపోకలు సాగే ఈ రహదారుల వెంట రేయింబగళ్లు భారీగా అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తున్నా...పాపం అధికారుల కళ్లకు మాత్రం కనపడటం లేదట...అవునులే పాపం...వాళ్లేం చేస్తారు...అధికార పార్టీ నాయకులు మా ప్రభుత్వంలో మమ్మల్ని అడ్డుకునేదెవరంటూ బహిరంగంగానే బెదిరిస్తుంటే కింది స్థాయి అధికారులు ఏం చేయగలరంటూ గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై వీఆర్వోను ప్రశ్నిస్తే మాకు తెలియదే...తెలిస్తే ప్రభుత్వ భూములు ఎందుకు తవ్వనిస్తాం అని ఎదురు ప్రశ్నించారు. తర్వాత తాను రెండు రోజులు ఊళ్లో లేనని, ఏమైనా జరిగివుంటే తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేస్తానని అంటూనే పత్రికల్లో రాయవద్దంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం గమనార్హం.

వీఆర్వోను విచారణకు ఆదేశించాను



గణపేశ్వరం శ్మశానం సమీప భూముల్లో ఎలాంటి మైనింగ్ లేదా రెవెన్యూ అనుమతులు లేవు. గత వారం రోజులుగా నా దృష్టికి ఎలాంటి తవ్వకాలు జరుగుతున్నట్టు నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇమ్మని వీఆర్వోను ఆదేశించాను.

–ముప్పిరిశెట్టి హరనాథ్, తహసీల్దార్, నాగాయలంక

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల కర్తవ్యమని, ఆ దిశగా మీ కోసంలో అందిన ప్రతి అర్జీని చట్టపరిధిలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన హాలులో జరిగిన మీకోసంలో పాల్గొన్న ఆయన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన బాధితుల సమస్యలను సామరస్యంగా ఆలకించి పరిష్కార చర్యలు తీసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన ఆయన మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు సిఫార్సు చేసి వెంటనే వాటిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్క పోలీస్ గుర్తుంచుకోవాలన్నారు. న్యాయం కోసం మనల్ని ఆశ్రయించే ప్రతి ఒక్కరికీ తప్పక న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి బాధలను ఆలకించాలన్నారు. సమస్య తీవ్రతను బట్టి ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి చర్యలు


మీకోసం లో బాధితుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

చేపట్టాలని సూచించారు. సిబ్బంది, అధికారులు ఎవరైనా సరే బాధితులకు న్యాయం చేయడమే కర్తవ్యం భావించాలన్నారు. న్యాయం కోసం ఆశ్రయించి బాధ్యతల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి పోలీస్ వ్యవస్థ ప్రజల వైపు ఉందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో సిబ్బంది అలసత్వం వహించినా, నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరించారు. అలాంటి ఆరోపణలు తన దృష్టికి వస్తే తక్షణమే చర్యలకు ఉపక్రమిస్తానని హెచ్చరించారు. మీకోసంలో 38 అర్జీలు అందగా వాటిలో కొన్నింటిని పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


అవార్డు అందుకుంటున్న కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన మొహమ్మద్ సనా ఉల్లాహ్ ఉమరి


బెస్ట్ ఉర్దూ టీచర్ అవార్డు అందుకుంటున్న కృష్ణాజిల్లా పెడనకు చెందిన ముంతాజ్ బేగం

మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. మౌజమ్స్, పాస్టర్లకు ఇచ్చే పారితోషికం నిధులను త్వరలో విడుదల చేయనున్నామని చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి దాదాపు రూ.365 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నామన్నారు. ఉర్దూ భాషలో ప్రతిభ కనబరిచిన పలువురికి అవార్డులను మైనార్టీ శాఖ మంత్రి ఫరూఖ్ ప్రదానం చేశారు. డాక్టర్ హక్ అవార్డును కృష్ణా జిల్లాకు చెందిన మహమ్మద్ సనావుల్లా ఉమరి, బెస్ట్ ఉర్దూ టీచర్ అవార్డును పెడనకు చెందిన ముంతాజ్ బేగం అందుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ అహ్మద్, ఎమ్మెల్యేలు మహ్మద్ నజీర్, షాజుద్దీన్, కొటికలపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్, కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఉర్దూ అకాడమి డైరెక్టర్ మహ్మద్ మస్తాన్ పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర వాలీబాల్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: పీబీ సిద్ధార్థ కాలేజీ క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-19 బాలబాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, విశాఖపట్నం, వైఎస్సార్ కడప, బాలికల విభాగంలో విశాఖపట్నం, పశ్చిమగోదావరి, విజయనగరం, గుంటూరు జిల్లాల జట్లు వరుసగా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలను సాధించినట్లు ఎస్‌జీఎస్ అండర్-19 కృష్ణాజిల్లా కార్యదర్శి, పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, పీబీ సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, కృష్ణాజిల్లా వాలీబాల్ సంఘం


బాలుర విభాగంలో విజేత శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కార్యదర్శి దోనేపూడి దయాకరరావు, పోటీల పరిశీలకులు ఎస్.నాగేశ్వరరావు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

నాయీ బ్రాహ్మణులను కించపరిస్తే ఊరుకోం

వైఎస్సార్ సీపీ నాయీబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): అధికార మదంతో నాయీ బ్రాహ్మణ సామాజికవర్గాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్ సీపీ నాయీ బ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్లు పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కడప పట్టణంలో ఆదివారం టీడీపీ నాయకుడు జిలాన్ బాషా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో 'పనీపాట లేని మంగలోడు పిల్లి తల గొరిగినట్టు' అంటూ వైఎస్సార్ సీపీ నేతల గురించి వ్యాఖ్యానించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో చంద్రబాబు నాయీ బ్రాహ్మణులను ఉద్దేశించి 'ఏం తమాషా చేస్తున్నారా..తోకలు కత్తిరిస్తా... దేవాలయం మెట్లు ఎక్కకుండా చేస్తా' అంటూ తమ జాతిని అవమానించిన సంగతిని తామింకా మరిచిపోలేదని అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఒక కులాన్ని కించపరిచే విధానం సరి కాదని హితవు పలికారు. నాయీ బ్రాహ్మణులను మంగలి, మంగలోడు తదితర పేర్లతో పిలిస్తే శిక్షార్హమని గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ గురించి తెలుసుకుని మాట్లాడాలన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని నాయీ బ్రాహ్మణ సమాజానికి క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మైనార్టీ నేత మొహమ్మద్ ఖలీలుల్లా ఆకస్మిక మృతి


మొహమ్మద్ ఖలీలుల్లా, న్యాయవాది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లిం మైనార్టీల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన నేత, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మొహమ్మద్ ఖలీలుల్లా సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన ఉదయం 8 గంటల సమయంలో విజయవాడలోని తన నివాసం నుంచి మార్నింగ్ వాక్ కోసం బందరు కాల్వ ఒడ్డున ఉన్న పార్కుకు వెళ్లి అక్కడే కుప్పకూలి మృతి చెందారు. జాతీయ స్థాయిలో మైనార్టీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తమ వాదాన్ని వినిపించేందుకు నిర్వహించిన మేధావుల సదస్సుల్లో ఖలీలుల్లా కీలక భూమిక పోషించారు. పౌరసత్వ చట్టం, వక్ఫ్ బోర్డు సవరణ చట్టాలను వ్యతిరేకిస్తూ నిర్వహించిన సదస్సుల్లో పాల్గొన్నారు. న్యాయవాదిగా అనేక మందికి తనవంతు సహాయ సహకారాలు అందించారు. ఆయన మృతి మైనార్టీ వర్గాలకు తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మతీన్‌లతో పాటు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ తదితరులు నివాళులర్పించారు.

బైక్ దొంగతనం కేసుల్లో నిందితుడు అరెస్ట్

రూ.10 లక్షల విలువైన 20 బైకులు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పార్కింగ్ చేసిన బైక్‌లను నకిలీ తాళాలతో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.10లక్షల విలువైన 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టి బైక్‌ల చోరీ వివరాలను సౌత్ డివిజన్ ఏసీపీ యు.బంగారురాజు వెల్లడించారు.
పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన నంద్యాల రామకృష్ణ రాజు సీసీ రోడ్ల కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటుపడిన అతను తన వద్ద ఉన్న మూడు సొంత బైకులను తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. తన చెడు వ్యసనాలకు, జల్సాలకు డబ్బులు సరిపోక ఏదైనా చేసి డబ్బులు సంపాదించాలని ఆలోచించాడు. గతంలో తాను బైకులు తాకట్టు పెట్టిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుని బైకులను దొంగతనం చేసి వాటిని అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తన ఊరిలో దొంగతనం చేస్తే దొరికిపోతామనుకుని దూరంగా వెళ్లి దొంగతనాలు చేయాలని అనుకున్నాడు. ఈ సంవత్సరం మార్చి నెలలో భీమవరం నుంచి విజయవాడ వచ్చి బస్టాండ్ సమీపంలో పార్క్ చేసి ఉన్న బైకును గమనించి నకిలీ తాళాలతో ఆ బైక్‌ను అపహరించాడు. ఈ విధంగా నగరంలో కృష్ణలంక, సూర్యారావుపేట, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్ దొంగతనాలు చేశాడు. ఒక్కసారిగా అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని, అప్పుడు ఇంకా బాగా జల్సాలు చేయవచ్చనే ఆలోచనతో దొంగతనాలు చేసి వాటిని దాచిపెట్టాడు. కేవలం


బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి మాట్లాడుతున్న ఏసీపీ బంగారురాజు

ఎనిమిది నెలల కాలంలో మొత్తం 20 బైక్‌లను దొంగతనం చేసి దాచిపెట్టాడు. సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ గౌతమిషాలి పర్యవేక్షణలో జిల్లాలో దొంగతనాలను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణలంక సీఐ ఎస్.ఎస్.వి.నాగరాజు ఆధ్వర్యంలో క్రైమ్ ఎస్ఐ ఎ.సూర్యనారాయణ అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేశారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం కృష్ణలంకలోని నల్లగేటు డౌన్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా సిటీ బస్ స్టాండ్, మాధురి ఫుడ్ కోర్ట్ సమీపంలో పార్క్ చేసి ఉన్న వాహనాన్ని దొంగిలించి దాచేందుకు తీసుకెళ్తున్నట్లుగా చెప్పాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో గతంలో దొంగతనం చేసిన 19 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకుని సుమారు రూ.10 లక్షల విలువైన 20 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన కృష్ణలంక ఎస్ఐ ఎ.సూర్యనారాయణ, క్రైమ్ హెడ్ కానిస్టేబుళ్లు జి.సాంబయ్య, జి.ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్ కె.బాబూరావులను పోలీస్ కమిషనర్, పోలీస్ అధికారులు అభినందించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కంకిపాడు: బందరు కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కంకిపాడు లాకులు సమీపంలో మృతదేహాన్ని గుర్తించి వెలికితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కంకిపాడు పట్టణానికి చెందిన పూల వ్యాపారి వాసా రమేష్ అలియాస్ పిచ్చియ్య (55) ఈ నెల 9వ తేదీ రాత్రి కంకిపాడు లాకులు సమీపంలోని వంతెనపై కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్ వి.భావన్నారాయణ నేతృత్వంలో మృతదేహం గాలింపునకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందానికి లేఖ రాయటంతో ఆదివారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కంకిపాడుకు చేరుకుంది. ఏఆర్ ఎస్ఐ భరకతుల్లా, హరిబాబు నేతృత్వంలో బృందం బందరు కాలువలో విస్తృతంగా గాలించింది. కంకిపాడు లాకులు సమీపంలోని వ్యర్థాల్లో ఇరుక్కుని ఉన్న రమేష్ మృతదేహాన్ని సోమవారం గుర్తించి వెలికితీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.సందీప్ తెలిపారు.


మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేరుస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

పంట కాల్వలోకి దూసుకుపోయిన లారీ

పాపవినాశనం(ఘంటసాల): కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తి లారీకి కుక్క అడ్డురావడంతో తప్పించబోయి మృత్యువాత పడిన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. మృతుని బంధువులు, పోలీసులు అందించిన వివరాల మేరకు అవనిగడ్డ మండలం బందలాయి చెరువు గ్రామానికి చెందిన గొరుముచ్చు దివాకర్(53) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి అవనిగడ్డ నుంచి లారీ ధాన్యం లోడుతో విజయవాడ వెళ్లాడు. విజయవాడలో ధాన్యం లోడు దించి తిరిగి అవనిగడ్డ కృష్ణా కరకట్ట వెంబడి వస్తుండగా ఘంటసాల మండలం పాపవినాశనం వద్ద రోడ్డుపై ఓ కుక్క లారీకి అడ్డు రావడంతో తప్పించేందుకు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళుతుండగా, లారీ డోర్ ఓపెన్ అయి కింద పడిపోయిన దివాకర్ మీదుగా లారీ చక్రాలు వెళ్లడంతో దివాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. దివాకర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఘంటసాల పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం దివాకర్ భౌతికకాయాన్ని అవనిగడ్డ ఆసుపత్రికి తరలించారు. మృతుడు దివాకర్‌కు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. దివాకర్ ఆకస్మిక మృతితో స్వగ్రామమైన బందలాయిచెరువులో విషాదఛాయలు అలుముకున్నాయి.


పాపవినాశనం వద్ద లారీ ప్రమాదంలో మృతి చెందిన దివాకర్ మృతదేహం (సర్కిల్‌లో)


దివాకర్ (ఫైల్)

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతి


మృతి చెందిన వెంకటనరసయ్య

కోనేరుసెంటర్: కరెంట్ షాక్‌కు గురై ఓ తాపీ మేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటనపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు మండలం కోకవానిపాలెం గ్రామానికి చెందిన తటవర్తి వెంకటనరసయ్య (26) తాపీ పని చేస్తుంటాడు. ఏడాది క్రితం భార్య చనిపోయింది. ఆరు నెలల క్రితం కుమార్తె ప్రమాదవశాత్తు చనిపోయింది. ప్రస్తుతం నరసయ్య ఒంటరిగా జీవిస్తున్నాడు. తాపీ పనులు చేసుకునే నరసయ్య రోజూలాగానే వలందపాలెంలో ఓ నూతన భవన నిర్మాణం పనికి వెళ్లాడు. రెండో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు హై టెన్షన్ వైర్లు తగిలి నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతుని వివరాలు నమోదు చేసుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కలుపు మందు తాగి వివాహిత ...


మృతురాలు రాహేల్‌కుమారి

పెనమలూరు: పోరంకిలో వివాహిత కలుపు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉష తెలిపిన వివరాల ప్రకారం కృత్తివెన్నుకు చెందిన నూతక్కి రాహేల్‌కుమారి(42) భర్త సుబ్రహ్మణ్యం, ఇద్దరు పిల్లలతో కలసి కొద్ది సంవత్సరాల క్రితం పోరంకికి వచ్చి ఉంటోంది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 7వ తేదీన గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా ఆమెను చికిత్స నిమిత్తం చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.